# అమృత వర్సిటీకి శంకుస్థాపన

- విలువలతో కూడిన విద్య సమాజానికి అవసరం: సీఎం చంద్రబాబు
- చీరలు ఇస్తామని సభకు తరలించి మోసగించారని మహిళల ఆందోళన
- డ్వాక్రా యానిమేటర్లు ఫోన్లు చేసినా స్పందించని టీడీపీ నేతలు

మంగళగిరి టౌన్: విలువలతో కూడిన సమాజం నిర్మాణం కోసం అమృత విశ్వవిద్యాలయం రాజధాని అమరావతి ప్రాంతంలో ఏర్పాటు కానుడటం అభినందనీయమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. కురగల్లు, యర్రబాలెం గ్రామాల మధ్య నిర్మించనున్న అమృత విశ్వవిద్యాలయానికి సీఎం బుధవారం శంకుస్థాపన చేశారు. అమృతానందమయి ట్రస్ట్ పలు దేశాల్లో సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తూ పేదలకు అండగా ఉందని చెప్పారు. సాధ్యమైనంత త్వరగా విశ్వవిద్యాలయ నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రవేశాలు ప్రారంభించాలని కోరారు. రాజధాని ప్రాంతవాసుల మౌలిక సదుపాయాల కోసం రూ.34 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు సీఎం చెప్పారు. కార్యక్రమంలో మంత్రులు కామినేని, గంటా, పి.నారాయణ, జడ్పీ చైర్‌పర్సన్ షేక్ జానీమూన్, కలెక్టర్ కోన శశిధర్, సీఆర్‌డీఏ కమిషనర్ చెరుకూరి శ్రీధర్, కొచ్చి అమృత ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ డైరెక్టర్ డాక్టర్ ప్రేమ్ నారాయణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న మహిళలు



## చీరలు ఇస్తామంటే వచ్చాం..

సీఎం పాల్గొంటున్న అమృత విశ్వవిద్యాలయ శంకుస్థాపన కార్యక్రమానికి వస్తే చీరలు ఇస్తామని చెప్పి తరువాత ఇవ్వకుండా మోసగించారంటూ పలువురు మహిళలు ఆందోళనకు దిగారు. మహిళలు భారీగా రావాలని, చీరలు ఇస్తామని రాజధాని ప్రాంతంలో దండోరా కూడా వేయటం గమనార్హం. దీంతో పలువురు




గ్రామాల్లో ఇచ్చిన టోకెన్లు

మహిళలు తెల్లవారుజామునే దూర ప్రాంతాలనుంచి ఆర్టీసీ బస్సుల్లో తరలి వచ్చారు. వారికి కనీసం మంచినీటి సౌకర్యం కూడా కల్పించలేదు. సీఎం సభ ముగిసిన వెంటనే భోజనాలు ఏర్పాటు చేసి చీరలిస్తామంటూ ఒకటికి నాలుగుసార్లు మైకులో ప్రకటించారు. అయితే సీఎం వెళ్లిపోయిన వెంటనే చీరలిస్తామన్న నాయకులు పత్తా లేకుండా పోయారు. మహిళలు నిలదీయటంతో డ్వాక్రా యానిమేటర్లు ఫోన్లు చేసినా టీడీపీ నేతలు స్పందించలేదు. మొక్కుబడిగా తెచ్చిన కొద్ది చీరలను తొక్కిసలాట జరుగుతుందనే ఆందోళనతో పోలీసులు వేరే చోటకు తరలించారు. ఆందోళనకు దిగిన మహిళలను గెంటేశారు. చివరకు కొద్ది చీరలను మాత్రం పార్టీ కార్యకర్తలకు అందచేశారు.